క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో రజత పతకం


నరేష్

కామారెడ్డి అర్బన్: ఖమ్మంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన ఆర్.నరేష్ రజత పతకం సాధించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ వెల్లడించారు.

పోచారం కాలువలో చేపల వేట



నాగిరెడ్డిపేట: పోచారం ప్రధాన కాలువలో చేపలు ఉండటంతో మండుటెండలో సైతం మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం వేటలో నిమగ్నమయ్యారు. కాలువలో నీరు తగ్గిపోవడంతో స్థానికులు వలలు, చీరలు ఉపయోగించి చేపలను పట్టుకున్నారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు

లింగంపేట: చేపల పెంపకం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని డీపీఎం రమేశ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మెంగారం గ్రామంలో ఏర్పాటు చేసిన డెమో ఫిష్ ప్లాంట్‌ను పరిశీలించారు. మండల సమాఖ్య సభ్యులు తమ పంట చేనుల్లో ఫిష్ ప్లాంట్ల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు రాజేందర్, శ్రీనివాస్, సీసీలు మేహర్, గంగరాజం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ నాటక ప్రదర్శన



నిజాంసాగర్: కనుమరుగు అవుతున్న ప్రాచీన కళలకు యువత జీవం పోస్తోంది. గురువారం రాత్రి మండలంలోని గున్కుల్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ జీవిత చరిత్ర గురించి నిర్వహించిన నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

కుల వృత్తిదారులకు అండగా ప్రభుత్వం



బీబీపేట: కుల వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యురాలు హేమశ్రీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండవ విడత గొర్రెల పంపిణీ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. బీబీపేట మండలానికి 341 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ముందుగా జనగామ, మల్కాపూర్, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి గ్రామాలకు చెందిన వారికి గొర్రెలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఏడీ బాస్కర్, ఎంపీటీసీ రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి



పెద్దకొడప్‌గల్: రాష్ట్ర ప్రభుత్వ పనుల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ కార్యకర్తలకు సూచించారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జుక్కల్ నియోజకవర్గం ఇన్‌చార్జి సొదగర్ గంగారాం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కైలాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలను ఇప్పటికే అమలు చేయలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపి, శ్రీనివాస్, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో రూ. 97 లక్షలతో బీటీ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పోలీస్ క్రిష్టాజీరావు, కాసర్ల గోదావరి స్వామి, మాజీ సర్పంచ్ నిట్టు వెంకట్‌రావు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నిట్టు లింగారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం తూకాలు

- వలస కూలీలకు ఉపాధి
- జిల్లాలో ఇప్పటి వరకు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ


లారీలను లోడ్ చేస్తున్న హమాలీలు


తూకాలు చేస్తున్న బిహార్‌కు చెందిన కూలీలు

నిజాంసాగర్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూకాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంట నూర్పిడి కొంత ఆలస్యం కావడంతో పది రోజులుగా కొనుగోలు స్పీడు పెంచారు. స్థానికంగా కూలీల కొరత ఏర్పడటంతో బిహార్ నుంచి కూలీల తో పాటు హమాలీలు పెద్ద ఎత్తున వచ్చారు. కూలీ లకు ఉపాధి దక్కుతుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2.50 లక్షలకు పైగా ఎకరాల్లో వరి పంటను రైతులు పండించారు. ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో 344 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఇప్పటి వరకు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 48,458 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలతో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ధ్రువ పత్రాలను తీసుకొని ధాన్యం డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వలస కూలీలకు ఉపాధి లభిస్తోంది. ధాన్యం తుకాలు వేసేందుకు స్థానికంగా ఉన్న కూలీలు ముందుకు రాకపోవడంతో సొసైటీ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బిహార్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన కూలీలపై ఆధారపడుతున్నారు. జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీలే ఉన్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో 12 నుంచి 18 మంది పని చేస్తున్నారు. అంతేకాకుండా 162 రైస్ మిల్లుల్లోనూ బిహార్‌కు చెందినవారు హమాలీలుగా పని చేస్తున్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


భిక్కనూరులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు


సదాశివనగర్‌లో..

భిక్కనూరు: కల్తీ ఉన్న పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖకు చెందిన టాస్క్‌ఫోర్స్ అధికారులు షాపుల నిర్వాహకులను హెచ్చరించారు. భిక్కనూరులోని పలు దుకాణాల్లో వారు తనిఖీలు నిర్వహించి అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరిశీలించారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో ఎల్లారెడ్డి ఏడీఏ రత్న, లింగంపేట, భిక్కనూరు ఏవోలు అనిల్, రాధ పాల్గొన్నారు.

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన దుకాణాలను టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు అపర్ణ, శ్రీనివాస్ తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్ తదితర వాటిని పరిశీలించారు. వారివెంట ఏవో ప్రజాపతి, హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్(బీర్కూర్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారి నూతన్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం బీర్కూర్‌లో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏవో కమల, అమర్ ప్రసాద్, ఏఎస్సై రాజేశ్వర్ ఉన్నారు.

వంతెన నిర్మాణం కోసం పరిశీలన


మాట్లాడుతున్న డీఈఈ వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట: మండలంలోని లింగంపల్లికలాన్ శివారు పోచారం ప్రధాన కాలువపై వంతెన నిర్మించనున్న ప్రాంతాన్ని శుక్రవారం నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. వంతెన నిర్మాణానికి రూ.50.90 లక్షలు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. వంతెన పనులను ఆదివారం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. కాలువ గట్టుపై ఉన్న పిచ్చి మొక్కలను, చెట్లను జేసీబీతో తొలగించారు. ఆయన వెంట లింగంపల్లికలాన్ ఇంచార్జి సర్పంచ్ కుమార్, ఎఫ్ఏ అంజయ్య తదితరులు ఉన్నారు.

నారాయణ్‌ఖేడ్‌కు రోజూ బస్సు నడపాలి


మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం సదాశివ్

బాన్సువాడ: డయల్ యువర్ డీఎం కార్యక్రమం సందర్భంగా బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం ఫిర్యాదులు స్వీకరించామని డీఎం సదాశివ్ తెలిపారు. బాన్సువాడ నుంచి నారాయణ్‌ఖేడ్‌కు రోజూ బస్సులు నడపాలని, అదేవిధంగా పిట్లం నుంచి మెదక్, సిద్దిపేటకు బస్సులు నడపాలని పలువురు కోరారు. ఉదయం 6.40 గంటలకు నిజామాబాద్ నుంచి బీర్కూర్, బిచ్కుంద, జుక్కల్ వరకు బస్సు నడపాలని ప్రయాణికులు కోరినట్లు వెల్లడించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని డీఎం తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి రూ. 1.90 కోట్లు



కామారెడ్డి రూరల్: మండలంలోని చిన్నమల్లారెడ్డి బాలికల పాఠశాలలో రూ. 1.90 కోట్లతో మన ఊరు–మన బడి పథకం ద్వారా చేపడుతున్న పనులను పంచాయతీరాజ్ ఏఈ ఆదిత్యరెడ్డితో కలిసి కామారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టగోని గోపిగౌడ్ పరిశీలించారు. ఎంపీటీసీ బీమయ్యల రాజు, విద్యా కమిటీ చైర్మెన్ మదాం గోపాల్, నాయకులు అనిల్ రెడ్డి, ఫజల్, నవీన్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



లింగంపేట: ఐకేపీలో పని చేస్తున్న విఓఏలకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండు చేశారు. శుక్రవారం ఆయన వీవోఏలతో కలిసి ఐకేపీ ఏపీఎంకు వినతి పత్రం అందజేశారు. డిమాండ్ల సాధన కోసం 34 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం అన్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ కోతి పిల్లకు చికిత్స



మాచారెడ్డి: కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడి ఉన్న కోతి పిల్లను మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చేపూరి సంతోష్ అక్కున చేర్చుకుని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. గజ్యానాయక్ తండా చౌరస్తాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి సకాలంలో తీసుకువెళ్లి చికిత్స చేయించడంతో ప్రాణాపాయం తప్పింది.

పేదల గురించి ఆలోచించే సీఎం కేసీఆర్


ఎమ్మెల్యే సింధేను సన్మానిస్తున్న లబ్ధిదారులు

పిట్లం: పేదల గురించి సీఎం కేసీఆర్ నిత్యం ఆలోచిస్తుంటారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా స్థానిక రైతు వేదికలో శుక్రవారం గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సభ్యులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో మండలంలోని పలువురు లబ్ధిదారులకు 622 గొర్రెల యూనిట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యేను లబ్ధిదారులు ఘనంగా సన్మానించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహారావు, బిచ్కుంద, మద్నూర్ సహాయ సంచాలకులు భాస్కరన్, వెంకటేశ్వరరెడ్డి, మండల పశువైద్యాధికారి సంతోష్ పాల్గొన్నారు.

తెగి పడిన విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం


ఎల్లారెడ్డి గాంధీచౌక్‌లో తెగి పడిన విద్యుత్ వైర్లు


తక్కతడ్‌పల్లిలో కిందకు వేలాడుతున్న తీగలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని గాంధీచౌక్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగి కిందపడ్డాయి. అక్కడి సమీపంలో కూరగాయల మార్కెట్ ఉండటంతో ఆ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అయితే వైర్లు కిందపడిన వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది వచ్చి వైర్లను సరి చేశారు.

బిచ్కుంద: తక్కతడ్‌పల్లి వెళ్లే రోడ్డు మార్గంలో సున్నపు వాగు వద్ద విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనాల్లో వెళ్లే వారికి తగిలే విధంగా వైర్లు కిందకు వేలాడుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో లైన్‌మెన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు.

జీలుగ విత్తనాల పంపిణీ


దోమకొండలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి


తిమ్మనగర్‌లో..

దోమకొండ: సబ్సిడీపై జీనుగ విత్తనాలను సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. రైతులు దుక్కులు దున్నే సమయంలో జీలుగ విత్తనాలు చల్లితే భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని తిమ్మనగర్‌లో డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. మండల రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, ఏఈవో ప్రదీప్‌రెడ్డి, సహకారం సంఘం కార్యదర్శి అశోక్ గౌడ్, శ్రీకర్ రెడ్డి, పందరి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: రైతులు జీలుగ విత్తనాలను నాటుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ రైతులకు సూచించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు సోకే తెగుళ్ల నివారణకు ఎంతో ఉపయోగం అన్నారు.

మొక్కలను పరిరక్షించాలి


బీబీపేటలో మొక్కలకు నీళ్లు పోస్తున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్


రాజంపేటలో..


ఎల్లారెడ్డి మండలం సాతోలి గ్రామంలో..

బీబీపేట/ఎల్లారెడ్డి రూరల్ /పిట్లం /రాజంపేట: మొక్కలు నాటి వాటిని రక్షించాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీళ్లు పోశారు. కార్యక్రమంలో బీబీపేట, పిట్లం, రాజంపేట ఎంపీడీవోలు పూర్ణచంద్రోదయ కుమార్, వెంకటేశ్వర్లు, బాలకిషన్, ఎల్లారెడ్డి మండలం సాతోలి, మీసానిపల్లి సర్పంచ్‌లు సంగమేశ్వర్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం


బీజేపీ నాయకుడు ఆకుల భారత్

మద్నూర్: ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని బీజేపీ మండల ఇన్‌చార్జి ఆకుల భారత్ పేర్కొన్నారు. మండలంలోని రూసేగావ్‌లో శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణతార, ఆ పార్టీ నాయకులు హన్మండ్లు, రఘు, సతీష్, హన్మండ్లు, వీరేశం, రాము, దీలిప్, విఠల్ పాల్గొన్నారు.

కంటి వెలుగుతో ప్రయోజనం


దేవాయిపల్లిలో లబ్ధిదారులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడ్వాయి: కంటి వెలుగు కార్యక్రమంతో పేదలకు ఎంతో ప్రయోజనం అని దేవాయిపల్లి సర్పంచ్ పైడి రాణి పేర్కొన్నారు. శుక్రవారం దేవాయిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌వీర్, డాక్టర్ రాజశేఖర్, కార్యదర్శి సాహిత్య పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రమైన పెద్దకొడప్‌గల్ ఐకేపీ కార్యాలయంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంపీడీవో రాణి, ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, బిచ్కుంద మార్కెట్ కమిటీ చైర్మన్ ఖండే రావు, ఉప సర్పంచ్ విఠల్, కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: మండలంలోని శాబ్దిపూర్‌లో కంటి వెలుగులో శిబిరంలో సర్పంచ్ పస్తం యాదమ్మ అర్హులైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్ శారత, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాల ముందు ఏర్పాటు చేసిన షెడ్డులను తొలగించాలని గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం ఎంపీవో ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతిప్రతం అందజేశారు. హరితహారం మొక్కలను తొలగించడంతో స్థలాన్ని ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేయడం తగదని వారు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

■ ఘనంగా బోనాల పండుగ



సదాశివనగర్: మండలంలోని అమర్లబండ గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు ప్రతి ఇంటి నుంచి బోనాలతో వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

■ బోనాల్ గ్రామంలో..



లింగంపేట: మండలంలోని బోనాల్ గ్రామంలో ముదిరాజ్‌ల కుల దైవం పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వొడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

■ మొక్కు తీర్చుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



నిజాంసాగర్: బడా పాహడ్ షాదుల్లా ఉర్సెన్ దర్గాను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, రాజు దంపతులు దర్శించుకొని మొక్కులు చెల్లించారు. కేసీఆర్ తిరిగి సీఎం కావాలని కోరుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు వాజిద్ అలీ, కాశయ్య, మహేందర్, జీవన్, నరేశ్, సాయాగౌడ్ తదితరులు ఉన్నారు.

■ శబరి మాత ఆశ్రమంలో పల్లకీ సేవ



తాడ్వాయి: శబరి మాత ఆశ్రమంలో గురువారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శబరి మాత ప్రతిమ, దివ్యసమాధిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు.

సంక్షిప్తం

దరఖాస్తు గడువు పొడిగింపు

సదాశివనగర్: మోడల్ జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం ఈ నెల 30 వరకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రావు తెలిపారు.

గొర్రెల పెంపకం పై అవగాహన

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులకు గొర్రెల పెంపకం అవగాహన కల్పించారు. ఏడీ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రెండో విడత గొర్రెలు త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మారుతి, జైపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

నస్రుల్లాబాద్: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కాంగ్రెస్ నేతలు రాజిరెడ్డి, ప్రతాప్ సింగ్ తదితరులు సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కష్టపడి పని చేస్తే బాన్సువాడలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నందు, అరిగె సాయిలు, శ్రీనివాస్ గౌడ్, శివ ప్రసాద్, సాయాగౌడ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన జిలుకర లక్ష్మీనర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీకాంత్ రూ.65 వేలు, డిచ్‌పల్లికి చెందిన కల్లెడ రవీందర్‌రెడ్డి రూ.50 వేలు విరాళం అందజేశారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద బజార్ వేణుగోపాల స్వామి ఆలయ పునరుద్దరణ పనులకు శ్రీ ఆర్యభట్ట కరస్పాండెంట్ గురువేందర్ రూ. 51వేలు, గౌరిశెట్టి శ్రీకాంత్ రూ. 25 వేలు, ఆకుల గోపీ, రావుల నర్సింలు రూ. ఐదు వేలు చొప్పున విరాళం అందజేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి..

కామారెడ్డి పట్టణం దేవునిపల్లి శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి అమెరికాలో ఉండే రెడ్డిపేటకు చెందిన కాష పూర్ణచందర్ రూ.51,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగయ్యచారి తెలిపారు.

32వ రోజుకు చేరిన రిలే దీక్షలు

భిక్కనూరు: విష వాయువు వెదజల్లుతున్న ఎంఎస్ఎన్ ప్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కాచాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకున్నాయి.

ఎల్‌వోసీ అందజేత

కామారెడ్డి రూరల్: టేక్రియాల్‌కు చెందిన సుంకరి భాస్కర్ కూతురు సుంకరి బిందుశ్రీ చికిత్స నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అందజేశారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

లింగంపేట: నూతనంగా పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు పథకం కోసం వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ సూచించారు.

జాగ్రత్తలతోనే సుఖ వ్యాధులు దూరం

దోమకొండ: జాగ్రత్తలతోనే సుఖ వ్యాధులు దూరమవుతాయని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక చైల్డ్ ఫండ్ ఇండియాలింక్ వర్కర్ స్కీం ప్రాజెక్ట్ చేస్తున్న సేవలను పరిశీలించారు. హెచ్ఐవీ, టీబీ నివారణ తదితర సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.